# ఉత్తరం

అడుగు ముందుకు వేస్తే వాళ్లు— తుపాకీలు పేలుతాయి.

రోడ్డుకి అటువైపు, ఇటువైపు డజన్లకొద్దీ పోలీసులు. వీధులు, సందులు అన్నీ నిర్మానుష్యంగా ఉన్నాయి.

కర్ఫ్యూ రాజ్యమేలుతోంది.

కన్పిస్తే కాల్చివేయమనే ఆర్డర్లు నాల్గు రోజుల నుంచి అమలులో ఉన్నాయి. అయినా తను ఆ రోడ్డు దాటాలి... ఎట్లా?

సందు మొగలులో, పడిపోయిన ఇంటి గోడల మాటుగా నిలబడి మణీంద్ర ఆలోచిస్తున్నాడు.

పదకొండేళ్ళు ఉంటాయతనికి. అతని జేబులో పొద్దున రమేష్ మామయ్య ఇచ్చిన ఉత్తరం ఉంది.

"జాగ్రత్తరా మణీ. ఊళ్ళో ఏమీ బాగోలేదు. సాయంత్రం కర్ఫ్యూ ఎత్తగానే నువ్వు రజియా అక్క ఇంటికెళ్ళి ఈ ఉత్తరం ఇచ్చేయ్. తర్వాత ఆమె ఎలా చెబితే అలా చెయ్యి. ఒకవేళ కర్ఫ్యూ ఎత్తకపోతే మాత్రం ఎక్కడికీ కదలకుండా ఇక్కడే జాగ్రత్తగా ఉండిపో. అర్థమయ్యిందా" ఆ ఉత్తరం ఇస్తూ అన్నాడు రమేష్ మామయ్య.

ఆ తర్వాత అరగంట సేపు తనకు ఎన్నెన్నో జాగ్రత్తలు చెప్పి మామయ్య వెళ్ళిపోయాడు.

కాని... కర్ఫ్యూ ఎత్తలేదు. ఎత్తుతామన్న ప్రకటన కూడా ఏదీ చెయ్యలేదు. అయినా సరే మణీంద్ర బయలు దేరాడు. మామయ్య ఇచ్చిన ఉత్తరం ఎంత ముఖ్యమైనదో ఏమో!

తనకు మామయ్య అన్నా మామయ్య మాట అన్నా ఎంతో గౌరవం. అమ్మా నాన్నలు చనిపోయాక మామయ్యే తనను పెంచుతున్నాడు. చిన్న తిట్టయినా తిట్టకుండా తనను ఎంతో ప్రేమగా చూసుకుంటున్నాడు. అందుకే మామయ్య ఏ పని చెప్పినా దాన్ని క్షణంలో చేసేయాలని అన్పిస్తుంది. అది పూర్తి చేసే వరకు నిద్ర పట్టదు. ఇప్పుడు కూడా అంతే. అందుకే కర్ఫ్యూ ఎత్తక పోయినా మామయ్య ఇచ్చిన ఉత్తరం అందించడానికి బయలు దేరాడు.

మామయ్య అప్పుడప్పుడు తన స్నేహితులతో రహస్యపు మీటింగులు పెడుతుంటాడు. ఆ మీటింగ్లల్లో విప్లవం గురించి, ఉద్యమాల గురించి మాట్లాడుకుంటూ ఉంటారు. మామయ్యకు తనంటే ఎంతో నమ్మకం. అందుకే ఆ మీటింగులకు రావలసిన మనుషుల్ని పిలవడం నుంచి మీటింగు పూర్తయ్యే వరకు తనతోనే ఎన్నో పనులు చేయిస్తాడు.

తనకు, మామయ్య చెప్పిన ఆ పనులన్నీ చేయడం ఎంతో సంతోషంగా ఉంటుంది. ఇప్పుడు రజియా అక్కకు ఇవ్వాల్సిన ఉత్తరం కూడా ఎంతో ముఖ్యమైనదై ఉండవచ్చు. లేకపోతే ఇంత కర్ఫ్యూలో మామయ్య తనకు పని చెప్పేవాడు కాదు...

ఎక్కడో తుపాకీ పేలిన శబ్దము, భయంకరమైన కేక వినిపించి, మణీంద్ర గుండె జలదరించింది... వెంటనే ఆలోచనల నుంచి తేరుకుని వారగా రోడ్డుకి అటూ ఇటూ చూశాడు.

పోలీసులు అక్కడే ఉన్నారు!!!

ఊళ్ళో ఎక్కడి నుంచో కేకలు, అరుపులు, తుపాకీలు పేలుతున్న చప్పుళ్ళు, ఇళ్ళు కాలిపోతున్న సెగలు వస్తూ వున్నాయి.

మణీంద్ర గుండె స్థిమిత పరుచుకుని తను వెళ్ళవలసిన సందు వంక చూశాడు.

అది రోడ్డుకి అటువైపు యాభై మీటర్ల దూరంలో వుంది. పోలీసులు తుపాకీలు పేల్చకముందే ఈ యాభై మీటర్లూ పరిగెత్తితే చాలు! ఆ సందు మొదలు చేరుకుంటే చాలు! పోలీసులు సందు దగ్గరికి వచ్చేలోగా తను రజియా అక్క ఇంట్లో ఉంటాడు. అదొక్కటే మార్గం. ఇక వేరే గత్యంతరం లేదు.

మణీంద్ర మరోసారి తన గుండె స్థిమిత పరుచుకుని, ఉత్తరం ఉన్న చొక్కా జేబు మీద ఎడం చేయి బలంగా నొక్కి పెట్టాడు.

"రెడీ ఒన్...టూ...త్రీ" అనుకుంటూ బుల్లెట్‌లా ముందుకు కదిలాడు.

ఒక్క క్షణం... ఇంకొక్క క్షణంలో సందు చేరతాడనగా తుపాకీ గుండు సూటిగా వచ్చి అతని ఛాతీలో దిగబడింది!!

వెంటనే మణీంద్ర క్రింద పడిపోయాడు.

రక్తం జివ్వున చిమ్మడం మొదలు పెట్టింది. అన్నీ మాయమై పూర్తిగా కళ్ళు మూతలు పడుతున్నట్లుగా అయిపోయింది. ఆ వెంటనే అతనికి రమేష్ మామయ్య... ఉత్తరం... తన డ్యూటీ... అన్నీ గుర్తుకొచ్చాయి.

అంతే.

ఒక రాక్షస శక్తి నడిపించనట్లుగా మళ్ళీ లేచి పరిగెత్తడం మొదలు పెట్టాడు...

మామూలుగా కంటే వేగంగా పరిగెత్తడం వల్ల నిమిషంలో రజియా అక్క ఇల్లు చేరాడు.

నిలువెల్లా రక్తంతో తడిసి, ఎర్రని మందారంలా ఉన్న మణీంద్రని చూసి, "అరె మణీ... ఏమిట్రా... ఏమిటిది?" అంటూ ప్రేమ, ఆందోళన కలసిన స్వరంతో, రజియా కంపించిపోతూ అంది.

"అక్కా... ర... మే... ష్... మా... మ... య్య... ఉ... త్త... రం..." అంటూనే, ఉత్తరం ఆమెకు అందించి మణీంద్ర తటాలున కూలిపోయాడు.

దుఃఖము, ఉద్వేగం ముంచి వేస్తూ ఉంటే రజియా కంపిస్తున్న చేతులతో ఆ కవర్ని చింపింది...

"రజియా బహెన్...

నేను రేపు ఖమ్మంలో జరిగే 'రైతు మహాసభ'లకు హాజరవ్వాలి. అక్కడ ఏం జరుగుతుందో చెప్పలేను. అల్లర్లు బాగా జరగవచ్చని అనిపిస్తుంది. అదే కనుక జరిగితే కాల్పులు అరెస్టులు తప్పనిసరి అయిపోతాయి. కాబట్టి నేను తిరిగి వచ్చే 'ఛాన్సెస్' అంతంత మాత్రమే ఉన్నాయి. చాలా రోజుల నుంచి పోలీసుల కళ్ళు నా మీద ఉన్నాయి. కాబట్టి అరెస్టు చేస్తే— ఇప్పుడిప్పుడే విడిచి పెట్టరు.

రజియా, మన ఊళ్ళో కూడా పరిస్థితి ఏమంత ఆశాజనకంగా లేదు. మత కలహాలు

పెరిగిపోతున్నాయి. ఇప్పుడిప్పుడే శాంతిం వేలా కన్పించడం లేదు. ఈ పరిస్థితిలో మణి ఒంటరిగా ఉండటం ఏమంత మంచిది కాదు. ఈ వీధి వాళ్లు వాడిని ఎంతో జాగ్రత్తగానే చూస్తారు కాని ఎవరైనా బయటి వాళ్ళు వచ్చినప్పుడు ఏమౌతుందో చెప్పడం కష్టం. అందుకే ఈ అల్లర్లు తగ్గేవరకు వాడిని నీ దగ్గరే ఉంచుకోమని కోరుతున్నాను. నేను వచ్చే వరకు వాడి తల్లి, తండ్రి నువ్వే. నీ మీాద నమ్మకంతో ఈ బాధ్యత నీకు అప్పగిస్తున్నాను. వాడు చాలా చురుకైన వాడు చెల్లీ. అద్భుతమైన ధైర్య సాహసాలు ఉన్నాయి వాడిలో. వాడిని ఎలాగైనా కాపాడాలి. వాడిలో ఉన్న జిజ్ఞాస, పట్టుదల చూస్తే నాకు ఎంతో ఆశ్చర్యం వేస్తుంది. రేపటి రోజున వాడొక మహాశక్తిలా తయారవుతాడు అని నాకు గట్టి నమ్మకం.

వాడిని జాగ్రత్తగా చూసుకుంటావని ఆశిస్తూ— ఇక ఉంటాను చెల్లాయ్.

ప్యారా భాయ్
రమేష్''

అప్పటి వరకు రక్తంతో తడిసిన ఆ ఉత్తరం ఇప్పుడు రజియా కన్నీళ్లతో తడవ సాగింది.

కె. ఆదర్శ సామ్రాట్

